సాక్షి మహబూబ్‌నగర్

ఆదివారం, 6, అక్టోబర్, 2024



442 మిలియన్ యూనిట్లు

జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో 442 మి.యూ., విద్యుదుత్పత్తి చేపట్టారు.

వివరాలు 8లో ▸



చంద్రఘంటాదేవి..

జోగుళాంబ అమ్మవారు శనివారం చంద్రఘంటాదేవిగా దర్శనమిచ్చారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.8 /21.6

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ ప్రభావం ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముగిసిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో డీఎస్సీ–2024కు సంబంధించి 1:3 ప్రకారం ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ శనివారం ముగిసింది. ఇప్పటి వరకు స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్, పీఈటీ, ఎస్జీటీ, ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ తదితర మొత్తం 223 పోస్టులకు వెరిఫికేషన్ నిర్వహించారు. అయితే 576 మంది వెరిఫికేషన్‌కు రావాల్సి ఉండగా 552 మంది హాజరవగా.. 24 మంది గైర్హాజరయ్యారు. మరో సబ్జెక్టు ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 20 పోస్టులు ఉండగా కోర్టు కేసు కారణంగా ఇందుకు సంబంధించిన మెరిట్ లిస్టు అధికారులకు చేరనందున దీనికి వెరిఫికేషన్ నిర్వహించలేదు. మరోమారు దీనికి వెరిఫికేషన్ నిర్వహించే అవకాశం ఉంది.

జెన్‌కో ఆధ్వర్యంలోనే థర్మల్ ప్లాంట్ నిర్మించాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జెన్‌కో ఆధ్వర్యంలోనే రామగుండం థర్మల్ ప్లాంట్‌ను నిర్మించాలని విద్యుత్ శాఖ డీఈ చంద్రమౌళి అన్నారు. నూతనంగా నిర్మించే విద్యుత్ కేంద్రాన్ని సింగరేణికి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యుత్ భవన్ ఎదుట ఉద్యోగులు చేపట్టిన నిరసన శనివారం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ వారికి ప్లాంట్ అప్పగించాలనే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. రామగుండంలో కట్టబోయే ప్లాంట్ స్థలం కూడా టీజీ జెన్‌కోదేనన్నారు. ఈ ప్లాంట్‌ను సింగరేణి, ఇతర కంపెనీలతో జాయింట్ వెంచర్ చేయడంతో టీజీ జెన్‌కో మనుగడ ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థను కాపాడుకోవడానికి ఉద్యోగులు ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ నాయకులు ఏడీ అనంతయ్య, నవీన్, సోమశేఖర్, చంద్రశేఖర్, వెంకటరమణ, స్వామి, పాండు, సంతోష్, బాబ్యానాయక్, వెంకట్రాయుడు, బాలరాంనాయక్, రామరాజు, ఉదయకుమార్, పెంటయ్య, విజయ్ పాల్గొన్నారు.

మైనార్టీల హక్కులు కాలరాయొద్దు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మైనారిటీల హక్కులను కాలరాయాలని కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని ఆలిండియా తంజీమే ఇన్సాఫ్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ అజీత్‌పాషా ఆరోపించారు. సంఘం ఆధ్వర్యంలో మొదటిరోజు శనివారం ఏనుగొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 'వక్ఫ్ అమెండ్‌మెంట్ యాక్ట్–2024'పై జాతీయస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ చట్టానికి సవరణల పేరుతో సమాధి చేయాలని కేంద్ర ప్రభుత్వం పథకాలు వేస్తోందని విమర్శించారు. మైనారిటీలను అణగదొక్కాలని చూస్తున్న ఈ ప్రభుత్వంపై ప్రజాస్వామికవాదులందరూ పోరాటం చేయాలన్నారు. దేశంలో 14 శాతం ఉన్న మైనారిటీలకు 30 శాతం ఆస్తులు ఎందుకనే ఈర్షతోనే ఈ చట్టానికి రూపకల్పన జరిగిందన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు లౌకిక శక్తులన్నీ ఏకం కావాలన్నారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ మైనారిటీ హక్కులతోపాటు ఆస్తులను హరించే విధంగా మోదీ సర్కార్ వ్యవహరిస్తోందన్నారు. మైనారిటీల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలిండియా తంజీమే ఇన్సాఫ్ జాతీయ గౌరవాధ్యక్షుడు అహ్మద్ షేర్వాని, ప్రధాన కార్యదర్శి అయాజ్‌అలీఖాన్, రాష్ట్ర అధ్యక్షుడు మునీర్‌పటేల్, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎండీ ఫయాజ్ పాల్గొన్నారు.



స్టీమ్ ఇంజిన్ బస్సు.. రయ్‌రయ్

సండే స్పెషల్

- 1889లోనే గద్వాల సంస్థానంలో ప్యాసింజర్ బస్సు సౌకర్యం
- బొగ్గుతో నడిచే ఒకే ఒక్క బస్సు సర్వీసు
- గద్వాల - రాయచూరు - కొల్లాపూర్ సంస్థానాల మధ్య రాకపోకలు
- కాలక్రమేణా కాలగర్భంలోకి..



బొగ్గుతో నడిచే స్టీమ్‌ఇంజిన్ ప్యాసింజర్ బస్సు

గద్వాల: బ్రిటీష్ పాలనకు ముందు ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి వెళ్లాలంటే సామాన్యులంతా ఎడ్లబండ్లు.. లేదా కాలినడకన.. కొద్దిగా ఆర్థికంగా ఉన్నవారు గుర్రాలపై వెళ్లేవారు. అప్పటికీ ఎలాంటి రవాణా సౌకర్యం ఉండేదికాదు. కానీ.. అలాంటి సమయంలోనే గద్వాల సంస్థానంలో బొగ్గుతో నడిచే స్టీమ్ ఇంజిన్ బస్సు రయ్‌రయ్ మంటూ పొగలు చిమ్ముకుంటూ పరుగులు పెట్టేది. 1600 సంవత్సర కాలంలో పూడూరు కేంద్రంగా గద్వాల సంస్థానాన్ని ఏర్పాటుచేసుకుని నలసోమనాద్రి అనే రాజు తన పాలనను సాగించాడు. కాలక్రమేణా.. బ్రిటీష్ పాలన.. దేశానికి స్వాతంత్ర్యం.. రజాకార్ల పాలన.. తెలంగాణకు విముక్తి లభించగా సంస్థానాన్ని స్వాతంత్ర్య భారతదేశంలో విలీనం చేశారు. ఈక్రమంలో తెలంగాణలోని గద్వాల సంస్థానాన్ని భారతదేశంలో కలిపేందుకు అప్పటి సంస్థాన మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ తన సుముఖతను వ్యక్తం చేస్తూ భారత ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగింది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న గద్వాల సంస్థానంలో 1889లోనే బస్సు సౌకర్యం ఉండేది.

బొగ్గే ఇంధనం..

స్టీమ్ ఇంజిన్ ప్యాసింజర్ బస్సు బొగ్గుతో నడిచేది. అప్పట్లో ఉన్న రోడ్డు మార్గం గుండానే పొగలు చిమ్ముకుంటూ రాకపోకలు సాగించేది. ఈ బస్సు గ్రామాల గుండా వెళ్తుంటే ప్రజలు ఎంతో ఆశ్చర్యంతో దానిని చూసేవారు. అప్పట్లో కేవలం ఎడ్లబండ్లు, గుర్రాలు మాత్రమే రాకపోకలకు ఉపయోగించేవారు. స్టీమ్ ఇంజిన్ బస్సు గద్వాల సంస్థానం నుంచి గట్టు, మాచర్ల మీదుగా రాయచూరు సంస్థానం వరకు మూడు రోజులు, తిరిగి గద్వాల నుంచి వయా పెబ్బేరు, పాన్‌గల్ మీదుగా కొల్లాపూర్ సంస్థానానికి మూడు రోజుల పాటు రాకపోకలు సాగించేది. ఈ బస్సుకు గద్వాలకు చెందిన అబ్దుల్లా డ్రైవర్‌గా పనిచేసినట్లు అప్పటి తరం వారు చెబుతారు. గద్వాల సంస్థానం భారతదేశంలో విలీనం అనంతరం 1948లో గద్వాల మున్సిపాలిటీగా ఏర్పడింది. మొత్తంగా 1889లోనే గద్వాలలో స్టీమ్ ఇంజిన్ ప్యాసింజర్ బస్సు కొన్నేళ్ల పాటు పరుగులు తీసి.. కాలక్రమేణా మరుగున పడిపోయింది.

చిన్నప్పుడు చూశాం



నాకు ఇప్పుడు 76 ఏళ్లు. నేను 10–12ఏళ్ల వయసు ఉన్నప్పుడు బొగ్గుతో నడిచే ప్యాసింజర్ బస్సు ఉండేది. ఈ బస్సు వారానికి మూడు రోజులు రాయచూరుకు,మరో మూడు రోజులు కొల్లాపూర్‌కు రాకపోకలు సాగిస్తుండేది. నేను ఈ బస్సులో ప్రయాణం చేయకపోయినా, బస్సును చూసినప్పుడల్లా ప్రయాణం చేయాలనే కుతూహలం ఉండేది. మా కుటుంబ పరిస్థితుల దృష్ట్యా అది సాధ్యపడలేదు. ప్రస్తుతం రాయల్‌లాడ్జ్ ప్రాంతంలో మహారాజ మార్కెట్ ప్రాంతంలో ప్యాసింజర్లు బస్సు ఎక్కేవారు.

– మోహన్‌రావు, సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు

ఒకే మాట..

దుందుభీలో ఇసుక తరలింపునకు అడ్డుకట్ట

సికింద్రాబాద్‌లో భారత ఆర్మీ అవసరాల కోసం 2004లో ఇసుక తరలించేందుకు ఆర్మీ బెటాలియన్ కోడ్గల్‌కు చేరుకుంది. జిల్లా అధికారుల అనుమతితో వారు దుందుభీలో టెంట్లు వేసుకున్నారు. అయితే గ్రామస్తులంతా ఐక్యంగా పోరాడి ఇసుక తరలింపును అడ్డుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం వారి ఐక్యతకు సలాం కొట్టి.. ఇసుక తరలింపు విషయంలో గ్రామస్తుల ఇష్టాన్ని గౌరవించాల్సి వచ్చింది. దీంతో వారం రోజులు మకాం వేసిన ఆర్మీ దళాలు ఇసుక తరలించకుండానే వెనక్కి మరలాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు పలు దఫాలుగా కోడ్గల్ నుంచి ఇసుక తరలించేందుకు ఎందరో ప్రయత్నించి విఫలమయ్యారు. ఇసుక తరలింపు అడ్డుకునే కార్యక్రమం కొందరి స్వార్థం కోసం మొదలుపెట్టారని ప్రచారం జరిగినా.. ఇప్పుడు భారీగా నిల్వలు పెరిగి.. భూగర్భజలాలు పెరుగుతుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– జడ్చర్ల టౌన్



కోడ్గల్ వద్ద దుందుభీ వాగులో ఇసుక

- ఐక్యతగా ఆర్మీని సైతం వెనక్కి పంపిన కోడ్గల్ గ్రామస్తులు
- దుందుభీ పొడవునా ఇక్కడే అత్యధిక నిల్వలు
- వాగు ఉధృతంగా పారితే ఏడాదికి రెండు పంటలు
- స్థానిక అవసరాలకు మాత్రమే వినియోగించుకునేలా చొరవ

జడ్చర్ల మండలంలోని కోడ్గల్ గ్రామస్తుల ఐక్యత ఆయుధంగా మారి దుందుభీ వాగులో ఇసుక నిల్వలు చేరాయి. దుందుభీ ప్రవాహం మొత్తంలో ఈ తరహాలో ఇసుక నిల్వలు ఎక్కడా లేవంటే అతిశయోక్తి కాదు. కోడ్గల్ గ్రామం వద్ద మొత్తం 8 కి.మీ., మేర ఇసుక నిల్వలు ఉండటంతో.. భూగర్భజలాలు సమృద్ధిగా ఉంటున్నాయి. వర్షాకాలంలో దుందుభీ ఉధృతంగా పారితే ఏడాదిలో రెండు పంటలు పుష్కలంగా పండేందుకు అవసరమైన భూగర్భజలాలు పెరుగుతాయి. ఈ కారణంగా గ్రామస్తులు అందరూ కలిసి ఇసుక తరలింపును అడ్డుకునేందుకు ఐక్యంగా ముందుకు వస్తారు. ఇసుక తరలింపు అడ్డుకునే క్రమంలో 20 మంది గ్రామస్తులపై కేసులు సైతం నమోదయ్యాయి. అయినప్పటికీ కోడ్గల్ గ్రామస్తులు మాత్రం ఐక్యతను చాటుకుని నిలబడటం విశేషం.

స్థానిక అవసరాలకు మాత్రమే

దుందుభీ వాగులో ఉన్న ఇసుకను కేవలం స్థానిక అవసరాలకు మాత్రమే వినియోగిస్తుంటారు. పూర్వ కోడ్గల్ గ్రామ పంచాయతీ పరిధిలోని తండాలకు సైతం ఇసుక తీసుకునే వెసులుబాటు కల్పించారు. గ్రామ సమీపంలో నచికేత తపోవనం నిర్మించినా ఇసుకను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకోవడం విశేషం. ఇక గ్రామానికి చెందిన కొందరు జడ్చర్ల, ఇతర ప్రాంతాల్లో ఇల్లు నిర్మించుకున్నప్పటికీ వారు దుందుభీ నుంచి కాకుండా.. ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం గమనార్హం. అయితే కోడ్గల్‌వాసుల ఐక్యత దుందుభీ వాగు పరిసర గ్రామాలకు వరంగా మారింది. వాగు పారినప్పుడు ఇసుక కొంత కిందకి రావడంతో వ్యాపారులకు కలిసొస్తుంది. అందుకే గ్రామ శివారులో చెక్‌డ్యాం నిర్మించాలని రైతులు కోరుతున్నారు. తద్వారా ఇసుక కిందకు పారకుండా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.



నిండుగా పారుతున్న దుందుభీ వాగు

1996లో కేసులు నమోదు..

1996లో గ్రామ శివారు నుంచి ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందుకున్న గ్రామస్తులు వాహనాలను అడ్డుకునేందుకు రెండు ట్రాక్టర్లలో మిడ్జిల్ మండలం భైరంపల్లి శివారుకు చేరుకున్నారు. అక్కడ ఇసుక తరలింపు దారులతో గొడవ జరగగా.. కొందరికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో గ్రామానికి చెందిన 20 మందిపై మిడ్జిల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. తర్వాత గ్రామపెద్దలు అధికారులతో మాట్లాడి వాటిని ఎత్తివేయించారు. వాస్తవంగా గ్రామంలోని ఒకరిద్దరు పెద్దలు తమ స్వార్థం కోసం గ్రామస్తులను అక్కడికి తరలించారని అప్పట్లో ప్రచారం జరిగింది. వారు స్వార్థంతో ఆలోచించినా ఇసుక విషయంలో గ్రామస్తుల ఐక్యతను మాత్రం చాటింది.

రెండు ట్రాక్టర్లలో వెళ్లాం..



1996లో గ్రామ శివారు నుంచి ఇసుక తరలిస్తున్నారని తెలుసుకుని ఊరు నుంచి రెండు ట్రాక్టర్లలో వెళ్లి అడ్డుకున్నాం. అప్పుడు చాలా గొడవ అయ్యింది. ఆ గొడవలో కొందరికి దెబ్బలు తగిలాయి. మిడ్జిల్ పోలీస్‌స్టేషన్‌లో మాపై కేసులు నమోదైనా వెనకడుగు వేయలేదు. ఇప్పటికీ దుందుభీ నుంచి ఇసుక తరలించకుండా చూస్తున్నాం. పార్టీలేవైనా ఇసుక విషయంలో మాత్రం మా అందరిది ఒకే మాట.

– నర్సింహులుగౌడ్, కోడ్గల్

ఇసుక వల్ల భూగర్భజలాలు



వర్షాకాలంలో వాగు ఉధృతంగా పారితే ఏడాది పొడవునా భూగర్భజలాలు ఉంటాయి. పోయినేడాది వాగు అంతగా పారలేదు. దీంతో కొన్ని నీళ్లు తగ్గిపోయాయి. ఈసారి ఇప్పటికే రెండుసార్లు వాగు పారింది. వాగు పారితే రైతులతోపాటు ఊరందరికీ ఎంతో మేలు కలుగుతుంది. అందుకే ఇసుక విషయంలో అందరం ఒకేమాట మీద నిలబడతాం.

– కృష్ణయ్య, కోడ్గల్

కలిసికట్టుగా ఉంటే..



ఇసుక తరలింపు విషయంలో మా గ్రామస్తులందరిది ఒకే మాట. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక తరలించేందుకు అంగీకరించం. ఇసుక ఉండబట్టే మా గ్రామంలో భూగర్భజలాలు పెరిగి రైతులకు మేలు జరుగుతుంది. మా గ్రామం లాగే దుందుభీ పరిసర ప్రజలు, రైతులు కలిసికట్టుగా ఉంటే ఇసుక తరలింపు ఆపడం సులువవుతుంది. తద్వారా ఎంతో మేలు కలుగుతుంది.

– శ్రీధర్‌రెడ్డి, కోడ్గల్

రెండు పంటలు..



స్థానిక గ్రామ అవసరాలకు మాత్రమే ఇసుక వినియోగిస్తాం. 1996లోనూ ఇసుక తరలింపు గొడవలో నాపై కేసులు నమోదయ్యాయి. అలాగే ఆర్మీని వెనక్కి పంపడంలోనూ గ్రామస్తులు ఐక్యత చాటారు. ఇసుక తరలించకుండా ఉన్నందునే మా ప్రాంతంలో భూగర్భజలాలు పెరిగి రెండు పంటలు పండించేందుకు వీలవుతుంది.

– యాదయ్య, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్

'కురుమూర్తి' జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, పక్కన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 18 వరకు జాతర సాగనున్న నేపథ్యంలో శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి కలెక్టర్ జిల్లాస్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీరు, పారిశుద్ధ్య, ఆహార, ఫెస్టివల్, లా అండ్ ఆర్డర్ తదితర ముఖ్యమైన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జాతరకు వచ్చే భక్తుల కోసం తాగునీరు, పారిశుద్ధ్యం, టాయిలెట్లు, బందోబస్తు, రవాణా సౌకర్యాలు, వాహనాల పార్కింగ్ ఏర్పాటుకు ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. బందోబస్తులో భాగంగా జాతర ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం, ప్రథమ చికిత్స కేంద్రం, అంబులెన్స్ వంటివి అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్‌అండ్‌బీ, పీఆర్ ద్వారా బారికేడింగ్‌తోపాటు రహదారులకు ప్యాచ్ వర్కులు, మరమ్మతు చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ శాఖ ద్వారా తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించాలని, షవర్లు పెట్టాలని, తాగునీరు, 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఎక్సైజ్ శాఖ బెల్ట్ షాపులను మూసివేయడమే కాకుండా మద్యం అమ్మకాలను అరికట్టాలన్నారు. భక్తులకు అన్ని విషయాలు తెలిసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ ద్వారా తగినన్నీ బస్సులు నడిపించాలని చెప్పారు. బ్రహ్మోత్సవాల గురించి జిల్లా ప్రజలతోపాటు ఇతర ప్రాంతాల వారికి తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. మరోసారి అన్ని శాఖల అధికారులతో క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి ఏర్పాట్లపై సమీక్షిస్తామన్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఏఎస్పీ రాములు, డీఆర్‌ఓ రవికుమార్, కురుమూర్తి స్వామి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.67 లక్షల మేర పక్కదారి

- 12 ఎస్‌హెచ్‌జీలతో విచారణలో బయటపడిన వైనం
- మరో 2 రోజులపాటు చేపట్టనున్న అధికారులు



మహిళా సంఘ సభ్యులతో వివరాలు సేకరిస్తున్న మెప్మా సీఓ నిర్మల

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళా సంఘ సభ్యుల పేరిట కోయనగర్‌కు చెందిన ఆర్‌పీ శ్రీలత వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకుని సుమారు రూ.67 లక్షలు పక్కదారి పట్టించినట్టు మొదటి రోజు విచారణలో బయటపడింది. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం దొడ్డలోనిపల్లి రెవెన్యూ వార్డు కార్యాలయం వద్ద విచారణ చేపట్టారు. శ్రీసాయి ఏఎల్‌ఎఫ్ పరిధిలో మొత్తం 33 ఎస్‌హెచ్‌జీలు ఉండగా ఇప్పటి వరకు 12 సంఘాల మహిళలతో వివరాలు సేకరించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా భారీ మొత్తంలో ఈమె రుణాలు తీసుకున్నట్టు తేలింది. తిరిగి నెలవారీ కిస్తులు సరిగా చెల్లించకపోవడంతో బాధిత మహిళలు ఆందోళనకు గురై ఈ నెల 3న అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా.. ఇంకా 21 సంఘాల మహిళలతో పూర్తిస్థాయిలో మరో రెండురోజులపాటు విచారణ చేపట్టనున్నారు. ఆ తర్వాతే ఎంత మేర అక్రమాలకు పాల్పడిందన్నది నిగ్గు తేలనుంది. ఈ విచారణ బృందంలో స్త్రీనిధి ఆర్‌ఎం వేణుగోపాల్‌రెడ్డి, మెప్మా డీఎంసీ శివకుమార్‌గౌడ్, సీఓలు వరలక్ష్మి, ఆంజనేయులు, నిర్మలతోపాటు మరికొందరు ఆర్‌పీలు ఉన్నారు. వీరందరూ ఆయా మహిళా సంఘాల సభ్యులతో సమగ్రంగా వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

ఈ–కుబేర్ వ్యవస్థను రద్దు చేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఈ–కుబేర్ వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, అలవెన్సుల బిల్లులను నేరుగా డీటీఓ లేదా ఎస్టీఓల ద్వారా చెల్లించాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ (టీపీసీఏ) జిల్లా అధ్యక్షుడు సాయిలుగౌడ్ కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్యుటేషన్ వ్యాల్యు అమౌంట్‌ను 15 నుంచి 11 ఏళ్ల మూడు నెలలకు కుదించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఆర్‌లను మంజూరు చేయాలని, ఈహెచ్‌ఎస్ పథకాన్ని పెన్షనర్ల భాగస్వామ్యంతో కొనసాగించాలని, గత ఏప్రిల్ 1 నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్‌తోపాటు గ్రాడ్యుటీ, జీపీఎఫ్ బకాయిలు విడుదల చేయాలన్నారు. సమావేశంలో టీపీసీఏ జిల్లా కార్యదర్శి బాల్‌కిషన్, కోశాధికారి విశ్వనాథం, నాయకులు రామచంద్రయ్య, నారాయణరెడ్డి, మహమూద్‌అలీ, బురానుద్దీన్, నారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అన్నపూర్ణాదేవి.. నమోస్తుతే

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మూడోరోజు జిల్లాకేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

– వివరాలు 9లో..



'పాలమూరు' కుస్తీ వీరులు

ధన్వాడలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పోటీల్లో ఓవరల్ చాంపియన్‌గా ఉమ్మడి మహబూబ్‌నగర్ నిలిచింది.

– వివరాలు 8లో..



హ్యాండ్‌బాల్ విజేత మహబూబ్‌నగర్

కోస్గిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్- 17 హ్యాండ్‌బాల్ టోర్నీలో మహబూబ్‌నగర్ బాలుర జట్టు మొదటి స్థానంలో నిలిచింది.

– వివరాలు 8లో..

క్లుప్తంగా

కారు బోల్తా.. ఒకరు మృతి



దశరథం (ఫైల్)

కొల్లాపూర్ రూరల్: అంకిరావుపల్లి సమీపంలో ప్రధాన రహదారిలో నాగర్‌కర్నూల్ నుంచి వస్తున్న కారు ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఘటనలో కారును నడుపుతున్న కొల్లాపూర్ పట్టణానికి చెందిన బిజ్జ దశరథం (55) అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా వాహనంలో ఉన్న చుక్కాయపల్లికి చెందిన వీఆర్‌ఏ మహేష్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. అతడిని నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల కథనం ప్రకారం.. దశరథ తహసీల్దార్ కార్యాలయం పని మీద నాగర్‌కర్నూల్‌లో వున్న కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రోడ్డు పని జరుగుతున్నందున గుంతను క్రాస్ చేయడంతో కారు అదుపుతప్పి బోల్తా పడింది. దశరథం తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడనే చనిపోయాడు. దశరథంకు భార్య లక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు.

బస్టాండ్‌లో ఆకస్మికంగా వృద్ధుడు ..

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ వృద్ధుడు శనివారం మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. అడ్డాకుల మండలం పొన్నకల్‌కు చెందిన వెంకటయ్య (70) భార్యతో కలిసి స్వగ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చాడు. బస్సు కోసం వేచి చూస్తుండగా ఆకస్మాత్తుగా మృతిచెందాడు. ఆర్టీసీ కంట్రోలర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఎత్తిపోతల కాల్వలో పడి వృద్ధుడు..

అమరచింత: అమరచింత ఎత్తిపోతల ప్రధాన ఎడమ కాల్వలో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణానికి చెందిన ఎరుకలి బాలస్వామి (64) రెండ్రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శనివారం అమరచింత ఎత్తిపోతల ప్రధాన ఎడమ కాల్వలో మృతదేహం కనిపించడంతో సమీప పొలాల రైతులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి బాలస్వామిదేనని నిర్ధారించారు. కుమారుడు శాంతన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం : అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఆత్మహత్యకు పాల్పడి.. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందిన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన కథనం మేరకు వనపట్లకి చెందిన పొన్నమ్మ (28) చాలారోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. మన స్తాపానికి గురై ఇంట్లో శుక్రవారం రాత్రి తలకు వేసుకునే హెయిర్ డై తాగి ఆత్మహత్య యత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు పొన్నమ్మను చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు గుర్తించి మహబూబ్‌నగర్ రెఫర్ చేశారు. దీంతో అక్కడకు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై పొన్నమ్మ భర్త సాయిబాబ శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ప్రాణం కాపాడిన గజ ఈతగాడు

ఎర్రవల్లి: ప్రమాదవశాత్తు నదిలో కొట్టుకుపోతున్న ఓ యువకుడి ప్రాణాన్ని స్థానిక గజ ఈతగాడు కాపాడిన ఘటన శనివారం బీచుపల్లి పుష్కరఘాట్ దగ్గర చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మఖ్తల్‌కు చెందిన హరికృష్ణ పుట్టు వెంట్రుకల కార్యక్రమం నిమిత్తం తమ కుటుంబ సభ్యులతో కలిసి బీచుపల్లి పుణ్యక్షేత్రానికి వచ్చాడు. నదిలో అందరితో కలిసి స్నానం చేసేందుకు వెళ్లగా నదిలో నీటి ఉధృతి వల్ల కొట్టుకుపోతుండడంతో గమనించిన స్థానికులు గట్టిగా కేకలు వేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కొండపేట గజ ఈతగాడు శాంతన్న యువకుడిని కాపాడి నది ఒడ్డుకు తీసుకొచ్చి సీపీఆర్ చేశారు. అనంతరం యువకుడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు గద్వాలకు తరలించారు.

రెజ్లింగ్ చాంపియన్ పాలమూరు





తలపడుతున్న నిజామాబాద్, మహబూబ్‌నగర్ క్రీడాకారులు

- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

ధన్వాడ: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ టోర్నీ ఓవరల్ చాంపియన్‌గా ఉమ్మడి మహబూబ్‌నగర్ నిలిచింది. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ధన్వాడలో నిర్వహిస్తున్న 68వ రాష్ట్రస్థాయి బాలికల రెజ్లింగ్ చాంపియన్‌షిప్ శనివారం ముగిసింది. అండర్-14, 17, 19 విభాగాల్లో ఉత్కంఠంగా సాగిన పోరులో పలు జిల్లాలకు చెందిన 30 మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్ నుంచి 10 మంది గోల్డ్ మెడల్ సాధించారు. హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు, ఆదిలాబాద్‌కు చెందిన నలుగురు, మెదక్ నుంచి ముగ్గురు, నిజామాబాద్ నుంచి ఇద్దరు క్రీడాకారులు గోల్డ్‌మెడల్ సాధించారు. నల్లగొండ, రంగారెడ్డి, ఖమ్మం, వరంగల్ నుంచి ఒక్కో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నట్లు డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్ శెట్టి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింహులు, రవి, శ్రీనివాసులు తెలిపారు.

అండర్-14 విభాగంలో విజేతలు వీరే..

30 కిలోల విభాగంలో మొదటి స్థానంలో నందిని (మహబూబ్‌నగర్), ద్వితీయ స్థానంలో శిరీష (వరంగల్) నిలిచారు. 33 కిలోల విభాగంలో నిహారిక (మహబూబ్‌నగర్), రక్షిత (హైదరాబాద్), 36 కిలోల విభాగంలో సీతామహాలక్ష్మి (మహబూబ్‌నగర్), అర్చన (రంగారెడ్డి), 39 కిలోల విభాగంలో శిరీష (మహబూబ్‌నగర్), కరుణ్య (వరంగల్), 42 కిలోల విభాగంలో ప్రియమణి (మహబూబ్‌నగర్), భువనేశ్వరి (ఆదిలాబాద్). 46 కిలోల విభాగంలో మౌనిక (మహబూబ్‌నగర్), భానుప్రియ (మెదక్), 50 కిలోల విభాగంలో వైష్ణవి (హైదరాబాద్), సాత్విక (మెదక్), 54 కిలోల విభాగంలో అర్చన (హైదరాబాద్), జయశ్రీ (నిజామాబాద్), 58 కిలోల విభాగంలో అర్చన (మెదక్), శ్రీక్ష (కరీంనగర్), 62 కిలోల విభాగంలో నైతిక (ఆదిలాబాద్), కీర్తి (మహబూబ్‌నగర్) విజయం సాధించారు.

అండర్- 17 విభాగంలో..

40 కిలోల విభాగంలో నందిత (నల్లగొండ), రేవణ (హైదరాబాద్), 43 కిలోల విభాగంలో నేహాబేగం (నిజామాబాద్), శిరీష (మహబూబ్‌నగర్), 46 కిలోల విభాగంలో షాభాన (రంగారెడ్డి), శిరీష (మహబూబ్‌నగర్), 49 కిలోల విభాగంలో బాలమణి (మహబూబ్‌నగర్), ప్రవళిక(వరంగల్), 53 కిలోల విభాగంలో నైనశ్రీ (హైదరాబాద్), లక్ష్మీప్రియ (మెదక్), 57 కిలోల విభాగంలో ప్రణిత (హైదరాబాద్), సిరి (వరంగల్), 61 కిలోల విభాగంలో సంతోష (మెదక్), కోమలి (నిజామాబాద్), 65 కిలోల విభాగంలో గీతాహర్షిని (ఖమ్మం), హిమశ్రీ (రంగారెడ్డి), 69 కిలోల విభాగంలో శివరంజని (మహబూబ్‌నగర్), శృతి (కరీంనగర్), 73 కిలోల విభాగంలో సిందుజ (నిజామాబాద్), సఫ్రారా (మహబూబ్‌నగర్) విజయం సాధించారు.

అండర్-19 విభాగంలో..

50 కిలోల విభాగంలో రజిత (మహబూబ్‌నగర్), అక్షయ (మెదక్), 53 కిలోల విభాగంలో గీత(మహబూబ్‌నగర్), అయేషా ఫిర్దోస్ (హైదరాబాద్), 55 కిలోల విభాగంలో అంజలి (వరంగల్), రజిన (హైదరాబాద్), 57 కిలోల విభాగంలో శ్రీజ (మెదక్), జోషిక (హైదరాబాద్), 59 కిలోల విభాగంలో షాలిని (ఆదిలాబాద్), మెహిరిన్ (హైదరాబాద్), 62 కిలోల విభాగంలో స్పందన (ఆదిలాబాద్), సమ్రిన్ సుల్తానా (హైదరాబాద్), 65 కిలోల విభాగంలో సాబియా సుల్తానా (హైదరాబాద్), శ్రీజ (ఆదిలాబాద్), 68 కిలోల విభాగంలో హరిప్రియ (హైదరాబాద్), సౌమ్య (వరంగల్), 72 కిలోల విభాగంలో సహస్ర (ఆదిలాబాద్), శ్రీనిధి (హైదరాబాద్), 76 కిలోల విభాగంలో ప్రీతి (హైదరాబాద్), అంజలి (వరంగల్) విజయం సాధించారు.

మొదటి బహుమతి అందుకుంటున్న మహబూబ్‌నగర్ జట్టు



హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం

కోస్గి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ టోర్నీ శనివారం ముగిసింది. హోరాహోరీగా సాగిన పోటీల్లో మహబూబ్‌నగర్ బాలుర జట్టు మొదటి స్థానంలో నిలిచింది. ఉమ్మడి పది జిల్లాలకు చెందిన బాలబాలికల జట్లు హాజరు కాగా.. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు ప్రథమ, కరీంనగర్ ద్వితీయ, వరంగల్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ఆదిలాబాద్ ప్రథమ, కరీంనగర్ ద్వితీయ, మహబూబ్‌నగర్ తృతీయ స్థానంలో నిలిచాయి. టోర్నీ ముగింపు కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కోడిగంటి అన్నపూర్ణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాల్‌రాజ్, పీడీలు నర్సింహ, రాజు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ టోర్నీలో రన్నర్‌గా నిలిచిన పాలమూరు

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో నిర్వహిస్తున్న హెచ్‌సీఏ అండర్-19 వన్డే అంతర్‌జిల్లా లీగ్ కమ్ నాకౌట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో ఉమ్మడి జిల్లా జట్టు చివరి వరకు పోరాడి ఓడిపోయింది. శనివారం మొగిలిచర్ల మైదానంలో ఉత్కంఠంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసింది. జట్టులో మహ్మద్ షాదాబ్ అహ్మద్ 89, అబ్దుల్ రాఫే 48 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసింది. ఉమ్మడి జిల్లా జట్టుకు రన్నరప్ ట్రోఫీ అందజేశారు. టోర్నీ ముగింపు కార్యక్రమంలో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా జట్టుకు రన్నరప్ ట్రోఫీ అందజేస్తున్న ప్రతినిధులు



విద్యుద్దీపాల వెలుగులో ఆలయం



నాట్యం చేస్తున్న చిన్నారి

చంద్రఘంటాదేవి నమోస్తుతే..!

- వైభవంగా కొనసాగుతున్న జోగులాంబ శరన్నరాత్రి ఉత్సవాలు
- ఆలయంలో నిత్య చండీహోమాలు.. ఉచిత సామూహిక కుంకుమార్చనలు



రథాన్ని లాగుతున్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడోరోజు శనివారం అమ్మవారు చంద్రఘంటా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అలంకరణలో అమ్మవారిని ఆరాధిస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని అర్చకులు వివరించారు.

ఇదిలా ఉండగా.. ఆలయంలో ప్రతిరోజు సామూహిక కుంకుమార్చనలు, త్రిశతి, ఖడ్గమాల, నవావరణ అర్చనలు కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తున్నారు.

కుమారి, సువాసిని పూజలు..

కొలువు పూజ, దర్బార్ సేవలో భాగంగా రోజు రాత్రి 7.30 వరకు కుమారి, సువాసిని పూజలు కొనసాగుతున్నాయి. అమ్మవారి పాదాల చెంత బాలిక, ముత్తైదువులను కూర్చొబెట్టి సాక్షాత్తు ఆ జగజ్జనికి చేసిన ఉపచారాలు వారికి చేస్తుండటంతో తమకు అలాంటి భాగ్యం లభించాలని భక్తులు పోటీ పడుతున్నారు. ఆలయంలో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి ప్రవచనాలతో పాటు భజన, హరికథ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో రోజు రథోత్సవం నిర్వహిస్తున్నారు. రాత్రివేళ అమ్మవారికి దశవిధ హారతులు ప్రత్యేక ఆకర్శణగా నిలుస్తున్నాయి.

కోడిపందేల స్థావరాలపై దాడులు

ఆత్మకూర్: కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించి 12 మందిని అరెస్టు చేశామని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. శనివారం సాయంత్రం మండలంలోని ఆరేపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంలో కొంతమంది కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 12 మందిని అరెస్టు చేసి వారి నుంచి 10 ద్విచక్ర వాహనాలు, 9 సెల్‌ఫోన్లు, రూ.11,590 నగదు, 8 కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా కోడిపందేలు, పేకాట ఆడినా.. అక్రమంగా ఇసుక, రేషన్ బియ్యం తరలించినా.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఏఎస్‌ఐ బీచుపల్లి, సిబ్బంది యుగేందర్, వెంకటన్నగౌడ్, బాలరాజు పాల్గొన్నారు.

పాన్‌షాపులో నగదు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు పాన్‌షాపులో చోరీకి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని శ్రీపురం చౌరస్తా వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన సాయిలు శ్రీపురం చౌరస్తా వద్ద పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి షాపుకు తాళం వేసి ఇంటికి వెళ్లగా అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పాన్‌షాపు రేకును తొలగించి.. గల్లాపెట్టెలో ఉన్న రూ. 60వేల నగదుతో పాటు కొన్ని వస్తువులను చోరీచేశారు. శనివారం ఉదయం షాపు వద్దకు వచ్చిన సాయిలు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఘటనకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

నల్లమలలో తప్పిపోయిన చెంచు యువకుడు

- మిత్రుడితో కలిసి కట్టెల కోసం వెళ్లి అదృశ్యం
- వారం రోజులుగా దొరకని లింగాల మండలం ఎర్రపెంట యువకుడి ఆచూకీ
- అటవీ సిబ్బంది, పోలీసుల ద్వారా కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్



శంకర్

సాక్షి, నాగర్‌కర్నూల్/ లింగాల: అటవీ ఉత్పత్తులు, కట్టెల కోసమని మిత్రుడితో నల్లమల అడవులకు వెళ్లిన ఓ చెంచు యువకుడు వారం రోజులుగా ఆచూకీ లేకుండాపోయాడు. అడవిలో అదృశ్యమైన చెంచు యువకుడి ఆచూకీ కోసం అటవీశాఖ, పోలీస్ అధికారులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం ఎర్రపెంటకు చెందిన చెంచు యువకుడు నిమ్మల శంకర్ గత నెల 28న శ్రీరంగాపురం గ్రామానికి చెందిన మిత్రుడు ఉడుతల కృష్ణయ్యతో కలిసి సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతానికి వెళ్లారు. చీకటి పడటంతో అక్కడే వాగు సమీపంలో పడుకున్నామని, రాత్రివేళ మెలకువ వచ్చి చూస్తే శంకర్ కనిపించలేదని కృష్ణయ్య చెబుతున్నాడు. అడవిలోకి వెళ్లి వారం రోజులుగా ఆచూకీ లేకుండాపోయిన శంకర్ జాడ కోసం అటవీ శాఖ, పోలీస్ అధికారులు మూడు రోజులుగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టినా ఫలితం లేకుండాపోయింది. ఆదివారం నుంచి డ్రోన్ ద్వారా సైతం గాలింపు చర్యలు చేపడతామని డీఎఫ్‌వో రోహిత్ గోపిడి తెలిపారు. చెంచు యువకుడు శంకర్ ఆచూకీ తెలియకపోవడంతో భార్య లక్ష్మమ్మ, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. శంకర్‌కు ముగ్గురు కూతుళ్లు, మూడు నెలల చిన్నారితో సహా ఇద్దరు కుమారులు ఉన్నారు.



యువకుడి కోసం అడవిలో గాలిస్తున్న అధికారులు

నా భర్త రాకపోతే చావే శరణ్యం..



అదృశ్యమైన శంకర్ భార్యాపిల్లలు

నా భర్త రెక్కల కష్టం మీద జీవనం కొనసాగిస్తున్నామని అదృశ్యమైన శంకర్ భార్య లక్ష్మమ్మ, తల్లి నిమ్మల ఈరమ్మ రోదిస్తూ తెలిపారు. ఐదు మంది సంతానంతో ఎలా బతకాలని, ప్రస్తుతం 3 నెలల పసికందు ఉన్నాడని భార్య తీవ్ర మనోవేదన వ్యక్తం చేస్తుంది. రేషన్ బియ్యం తీసుకోవాలన్న తన భర్త వేలిముద్ర ఉంటేనే బియ్యం ఇస్తారని లక్ష్మమ్మ వాపోయింది. భర్తకు అడవి మొత్తం తెలుసు అని, అడవి మార్గం తెలియని వ్యక్తి ఇంటికి రావడం అనుమానంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

నిద్ర లేచేసరికి కనిపించలేదు..

నిమ్మల శంకర్ ఎక్కడికి వెళ్లాడో నాకు తెలియదని ఆయన వెంట వెళ్లిన ఉడ్తల కృష్ణయ్య పేర్కొన్నాడు. ఇద్దరం కలిసి అటవీ ప్రాంతానికి వెళ్లి ఒక వాగు దగ్గర నిద్రించగా తెల్లారే సరికి శంకర్ కనిపించకపోవడంతో వెతికి తిరిగి ఇంటికి వచ్చి వారు కుటుంబ సభ్యులకు చెప్పానన్నాడు. కాగా అతని మాటలు స్పష్టంగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. అదృశ్యమైన వ్యక్తి వెంట వెళ్లిన కృష్ణయ్యను ప్రస్తుతం పోలీసులు పెంటలోనే ఉంచారు. అతని ఆచూకీ దొరికిన తర్వాతే వదులుతామని చెబుతున్నారు.

సీఐ అత్యుత్సాహం..

- అమ్మవారి దీక్షలో ఉన్న యువకులపై దాడి
- ఆగ్రహించిన పలు హిందూ సంస్థలు.. విద్యార్థి సంఘాల నాయకులు
- సీఐ తీరును నిరసిస్తూ పెద్దఎత్తున ఆందోళన
- పాలమూరు- తాండూరు రహదారిపై ధర్నా



ధర్నా చేస్తున్న యువకులతో మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

కోస్గి: ఏదైనా గొడవ జరిగితే పోలీసులు తమదైన శైలిలో వ్యవహరించి వివాదం తీవ్రతరం కాకుండా నియంత్రించాల్సి ఉంటుంది. కానీ ఓ పోలీసు అధికారి మాత్రం పూర్తి వివరాలను తెలుసుకోకుండా దీక్షలో ఉన్న యువకులను దూషిస్తూ.. దాడి చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వివరాల్లోకి వెళ్తే.. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని పలు కాలనీల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ నేపథ్యంలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా యువకులు పెద్దఎత్తున అమ్మవారి దీక్ష చేపట్టారు. స్థానిక శ్రీలక్ష్మీవేంకటేశ్వర, శివసాయి, అయ్యప్ప ఆలయాల ప్రాంగణంలో ఉత్సవాల నిర్వాహకులు (దీక్షాపరులు) పట్టణంలోని అమ్మవారి విగ్రహాలను దర్శించుకొని ఆలయానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఓ వర్గం అమ్మాయి ఇంటి వద్ద మరో వర్గం యువకుడు రహస్యంగా మాట్లాడుతుండగా.. గమనించిన యువకులు అతడిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. సమాచారం అందుకున్న సీఐ దస్రూనాయక్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చీ రాగానే దీక్షలో ఉన్న యువకులను దూషిస్తూ.. ఓ యువకుడిని కొట్టారు. విషయం తెలుసుకున్న హిందూ సంస్థలు, విద్యార్థి సంఘాల నాయకులతోపాటు యువత పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఆందోళనకు దిగారు. పాలమూరు- తాండూర్ రహదారిపై బైఠాయించి సీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

తెల్లవారుజాము వరకు ధర్నా..

శనివారం తెల్లవారుజాము వరకు ధర్నా కొనసాగింది. విషయం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు జిల్లాలోని సీఐలు, ఎస్‌ఐలను అప్రమత్తం చేశారు. డీఎస్పీ లింగయ్య ఘటనా స్థలానికి చేరుకొని యువకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అయితే సీఐని సస్పెండ్ చేసే వరకు ధర్నా విరమించేది లేదని యువకులు భీష్మించారు. రెండు రోజుల్లో సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో యువకులు ధర్నా విరమించారు. పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, సీఐ వ్యవహార తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయమై సీఐ దస్రూ నాయక్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

సైబర్ వలకు చిక్కిన యువకుడు

అమరచింత: మండలంలోని నందిమళ్ల క్రాస్‌రోడ్‌కు చెందిన నరేష్ సైబర్ వలకు చిక్కి రూ.19,588 నష్టపోయారని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఇండియన్ బుల్ యాప్ ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అన్న సమాచారంతో జులై 15న నరేష్ తన మొబైల్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని దరఖాస్తు చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ తదితర ఖర్చుల పేరిట రూ.19,588 వసూలు చేసి స్పందించకపోవడంతో మోసపోయానని గుర్తించారు. శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సురేష్ వివరించారు.

వ్యభిచార కేసులో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్

గద్వాల క్రైం: గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై పోలీసులు దాడులు చేసి ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గద్వాలలోని న్యూహౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో ధరూర్ మండలం జాంపల్లి గ్రామానికి చెందిన కృష్ణవర్ధన్ (కృష్ణవర్ధన్‌రెడ్డి), గద్వాల పట్టణానికి చెందిన సమీర్‌కుమార్ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కొన్ని రోజుల నుంచి వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. శుక్రవారం ఓ యువతితో ఇద్దరు యువకులు ఆ ఇంట్లో ఉన్నట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన సమయంలో వారు మద్యం మత్తులో ఉన్నారు. కాగా వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా నిందితులను గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే నిందితులు గంజాయి తీసుకున్నట్లు వస్తున్న ఆరోపణలో నిజం లేదన్నారు. కానీ, యువకుల సెల్‌ఫోన్‌లో గంజాయికి సంబంధించిన ఫొటోలను గుర్తించామని, ఈ విషయమై ఆరా తీస్తున్నట్లు వివరించారు. యువతితో యువకులకు ముందు నుంచే పరిచయం ఉందన్నారు. నిషేధిత మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లు నిర్ధారణ అయితే చట్ట పరమైన చర్యలు ఉంటాయన్నారు. బాధితురాలిని కౌన్సెలింగ్ నిమిత్తం సఖీ సెంటర్‌కు తరలించామన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

జూరాల జలాశయంలో ప్రస్తుత నీటిమట్టం



ధరూరు/ దోమలపెంట/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టిందని అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం 7 గంటల వరకు ప్రాజెక్టుకు 55,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో క్రస్టుగేట్లను మూసివేశారు. ఇదిలా ఉండగా.. విద్యుదుత్పత్తి నిమిత్తం 38,621 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 730, సమాంతర కాల్వకు 400, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు వదలగా మరో 91 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.255 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో 882.0 అడుగుల నీటిమట్టం

శ్రీశైలం జలాశయంలో శనివారం నీటిమట్టం 882.0 అడుగుల వద్ద 198.8120 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కాగా జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 38,621 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 117 మొత్తం 38,783 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వస్తుంది. దీంతో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,163 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 27,350 కలిపి 63,513 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 10,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,560, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

442 మి.యూ., విద్యుదుత్పత్తి

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతుంది. శనివారం ఎగువలోని 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ సూరిబాబు తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటి వరకు 442.534 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామన్నారు.